క్లుప్తంగా

స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమాదేవి

కోదాడఅర్బన్ : పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. శనివారం కోదాడలోని బొడ్రాయి బజారులో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గాధంశెట్టి శ్రీనివాసరావు, పుర ప్రముఖులు వంగవీటి రామారావు, పైడిమర్రి వెంకటనారాయణ, ఇరుకుల చెన్నకేశవరావు, పైడిమర్రి నారాయణరావు, యాదా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన


తాను తయారు చేసిన లైఫ్ సేవింగ్ స్టిక్‌ను చూపిస్తున్న విద్యార్థి

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పృథ్వీ తయారు చేసిన లైఫ్ సేవింగ్ స్టిక్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుకు ఎంపికయ్యాడు. దీంతో శనివారం మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృథ్వీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

నడిగూడెం : కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య అన్నారు. శనివారం ఆ కళాశాలలో దున్నా భాగ్యమ్మ, వెంకయ్యల జ్ఞాపకార్థం ది ఫైర్ ఆర్గనైజేషన్ సహకారంతో రూ.8500ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ పుల్ అప్స్ బార్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడానికి ఇలాంటివి ఉపయోగపడాయన్నారు. కార్యక్రమంలో ది ఫైర్ ఆర్గనైజేషన్ సభ్యులు దున్నా సతీష్, లతీఫ్, నాగరాజు, శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, పలకలు పంపిణీ


చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న నాగరాజు- తిరుప దంపతులు

మఠంపల్లి : మండలంలోని కొత్తతండాకు చెందిన బానోతు నాగరాజు- తిరుప దంపతులు శనివారం తమ కుమారుడు బానోతు లిత్విక్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని కాలవ్వపల్లితండాలో గల అంగన్‌వాడీ కేంద్రంలో, కొత్తదొనబండతండాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పలకలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, టీచర్ రాజ్యలక్ష్మి,హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామనాథంకు నివాళి


నివాళులర్పిస్తున్న గన్నా చంద్రశేఖర్ తదితరులు

చిలుకూరు : పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలకు టెక్నికల్ కోర్సులు తీసుకొచ్చి పేద విద్యార్థులకు విద్య అందించిన ఘనత అక్షర కళాశాల చైర్మన్ కైలాసపు రామనాథంకే దక్కిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం చిలుకూరులో రామనాథం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, ఆంజనేయులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలుకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు చిలుకూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిధులు లేక ఎంపీటీసీలు సతమతం

- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని దుస్థితి
- కొత్త ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయించాలని వేడుకోలు


కోదాడ మండల పరిషత్ కార్యాలయం

కోదాడరూరల్ : ఎంపీటీసీలకు ఎన్నికల్లో గెలిచినంత సంతోషం, ఊపు ఆ తర్వాత ఉండటం లేదు. ఎన్నికల్లో గెలిచేందుకు లక్షల్లో ఖర్చు పెట్టినా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక సతమతం అవుతున్నారు. అందరు ప్రజాప్రతినిధుల మాదిరిగానే ఎన్నికల్లో ప్రజల ఓట్లతో గెలిచినా తమకు కనీస గౌరవం లేకుండా పోతుందని గ్రామ పంచాయతీల్లో ఓ సీటు కూడా ఉండదని, మండల పరిషత్‌లో కూడా తమకంటూ ఓ గది కూడా కేటాయింపు లేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటప్పుడు ఎంపీటీసీల వ్యవస్థ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులు గెలిచి దాదాపు ఐదేళ్లు కావస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల్లో తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక, ఏం అభివృద్ధి పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 11 మంది ఎంపీటీసీలు

కోదాడ మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉండగా 11 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 2019 మే లో ఎన్నికలు జరగగా జూన్ 7న ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి గత ప్రభుత్వం కానీ ప్రస్తుత ప్రభుత్వం కూడా ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. అప్పుడప్పుడు విడుదలవుతున్న జిల్లా పరిషత్ నిధులతో కొందరు ఎంపీటీసీలు అరకొర పనులు చేపట్టారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇచ్చే ఛాయ్, బిస్కెట్ల కోసమే తాము హాజరవుతున్నట్లు ఉన్నట్లుందని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమావేశాల్లో ఒక్కరో ఇద్దరో ఎంపీటీసీ సభ్యులు ప్రజా సమస్యలపై చర్చ లేవనెత్తినా వాటిని అప్పటికప్పుడు పరిష్కరిస్తామని అంటున్నారే కానీ ఆ తర్వాతే పట్టించుకునేవారే కరువయ్యారని చెబుతున్నారు. అదేవిధంగా ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనం కూడా సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. మిగిలిన ఈ మూడున్నర నెలల కాలంలోనైనా కొత్త ప్రభుత్వం తమకు ఏవైనా నిధులు కేటాయిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తామని తద్వారా గ్రామాల్లో కనీస గౌరవం అయినా పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేయాలి



ప్రత్యేక అధికారుల పాలన కాలంలోనైనా అధికారులతో పాటు మాకు కూడా ఈ మూడు నెలలకాలంలో అభివృద్ధి పనుల్లో భాగస్వాములు అయ్యే విధంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తే బాగుటుంది. మాకంటూ ఎలాంటి నిధులు, పనులు లేకపోవడంతో గ్రామాల్లో తలెత్తుకోలేని పరిస్థితి ఉంది. ఇక కొత్త ప్రభుత్వంలోనైనా మాకు నిధులు కేటాయించి ఎంపీటీసీలను గుర్తించాలి.

– శంకరశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ, కూచిపూడి

భాషం సైదులుకే చైర్మన్ బాధ్యతలు


బేతవోలు పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న భాషం సైదులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా శనివారం తిరిగి భాషం సైదులు బాధ్యతలు స్వీకరించారు. అయితే సంఘంలో అవినీతి జరిగినట్లు సంఘంలోని 13 మంది డైరెక్టర్లలో 9 మంది డైరెక్టర్లు జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి సంఘం చైర్మన్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో జనవరి 26న సంఘంలో అత్యవసర సమావేశం నిర్వహించి తాత్కాలిక చైర్మన్‌గా డైరెక్టర్ బజ్జూరి రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఇక చైర్మన్ పదవి నుంచి తొలగించబడిన భాషం సైదులు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు భాషం సైదులపై సస్పెన్షను ఎత్తివేస్తూ అతనినే సంఘం చైర్మన్‌గా యాదావిధిగా కొనసాగించాలని స్టే ఆర్డర్ ఇచ్చింది. దీంతో డీసీఓ ఆదేశాల మేరకు సీఈఓ పాషా సంఘం చైర్మన్‌గా సైదులుకు తిరిగి బాధ్యతలు అప్పగించారు.

భూమి ఆక్రమణపై ఆర్డీఓకు ఫిర్యాదు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర బండపాలెంలో ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని అక్రమంగా ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నారని 2వ వార్డు ఎస్సీ కాలనీ ప్రజలు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం 446 బై అ 3లో సుమారు నాలుగు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇచ్చిందని తెలిపారు. అందులో రెండు ఎకరాలు భూమిని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇవ్వగా మిగిలిన రెండెకరాల భూమిని భూమి అమ్మిన వ్యక్తి వారసుడు కనగాల కొండయ్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొనే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూమి మొత్తం విక్రయించలేదు

446 బై అ 3లో మొత్తం 4 ఎకరాల 30 గుంటల భూమి ఉందని అందులో 3.6 గుంటలు మాత్రమే విక్రయించామని భూమి అమ్మిన వ్యక్తి వారసులు కనగాల కొండయ్య, పూర్ణచందర్‌రావు తెలిపారు. మిగిలిన 1 ఎకరం 24 గుంటల భూమి తమ పేరు మీద పట్టా ఉందని తెలిపారు. భూమికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. తమ బంధువు ఒకరు 12 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆ భూమి కోసం తమపై కావాలనే ఇతరులతో ఆరోపణలు చేయిస్తున్నారని వారు తెలిపారు.

పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయవాణిదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, ప్రసాద్, ప్రభాకర్, అస్మా ముబీన్, శేషగిరి, అన్వేష్, శైలజ, దీనా రాణి, వసంతరావు, జనార్దన్ రెడ్డి, శేఖర్, అశోక్, మున్ని బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల గణనతో సామాజిక న్యాయం

మునగాల : కుల గణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా లెక్కించేందుకు ఇంటింటి సర్వే చేపట్టేలా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సుధాకర్‌గౌడ్ బీసీ విద్యార్థి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 1932లో జరిగిన కులగణననే ఇప్పటికీ అమలవుతుందని, ఇందువల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోతె : పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సంధ్యాదేవి, రజినిదేవి, యల్లమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

హుజూర్‌నగర్ : పట్టణంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో గోవిందపురం వెళ్లే మూలమలుపు వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా తయారైంది. మ్యాన్‌హోల్ మూత పలిగి చాలారోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం కనకదుర్గ గుడి, శివాలయానికి వెళ్లే భక్తులు, గోవిందపురం, వేపలసింగారం, మేళ్లచెరువు తదితర గ్రామాలకు వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. కావున ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ మూత మరమత్తులు చేయించాలని, లేదా కొత్తదైనా ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన పలువురు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులకు కూడా విన్నవించినట్లు సామాజిక కార్యకర్త ఆకుల రాము తెలిపారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


హుజూర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు


నేరేడుచర్ల : బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో..

మఠంపల్లి : మండల కేంద్రంతో పాటు యాతవాకిళ్లలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ ఎంపీపీ కొండానాయక్, మాజీ సర్పంచ్‌లు కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, బీవీరామారావు, జాల కిరణ్‌యాదవ్, నాగయ్యయాదవ్, వెంకటేశ్వర్లు, బాలాజీనాయక్, తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నాగండ్ల శ్రీధర్, చిత్తలూరి సైదులు, చెన్నబోయిన సైదులు, ఎల్లబోయిన లింగయ్య, లచ్చిరెడ్డి, మార్కండేయ, రంగా శ్రీను, సుదర్శన్, జగతయ్య, ఇందుజా, తదితరులు ఉన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఎంపీటీసీ కడియం స్వప్నవెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, సైదులు, అరవింద్‌రెడ్డి, మన్సూర్‌అలీ, వీరయ్యగౌడ్, సీతారాంరెడ్డి, సైదాబీ, మహ్మద్, వెంకటేశ్వర్లు, సుందరయ్య, నగేష్, గోపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, కౌన్సిలర్ జక్కుల వీరయ్య, నాయకులు బి.అమర్‌గౌడ్, అలీ, కేఎల్‌ఎన్ రెడ్డి, పిచ్చయ్య, ఉపేందర్, సీహెచ్.కవిత, ప్రదీప్, దీప తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు బడేటి చంద్రయ్య, బోనగిరి ఉపేందర్, బొల్లం శ్రీను, దాసరి శ్రీను, ఎండి.జలీల్, అనంతుల మహేష్, కాసాని సతీష్, మురళి పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, డీఎల్‌డీపీ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబాల వెంకటి, పార్టీ నాయకులు షేక్ పాషా, ఉపేందర్, నర్సయ్య, వెంకయ్య, లింగరాజు, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లిలో..


మునగాలలో..


చిలుకూరులో..

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం


మునగాల : కోదండరామాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బిందు


కోదాడరూరల్ : సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


గరిడేపల్లి : సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కటికం ఆశారమేష్

మునగాల : నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. మండలంలోని కోదండరామాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నుంచి మంజూరైన రూ.పది లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కవిత, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మంగళితండాలో..

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని మంగళితండాలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, కునుగుంట్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పొనుగోడులో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలోని 8వ వార్డులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ కటికం ఆశారమేష్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికం లక్ష్మీనారాయణ, వనపర్తి గురవయ్య, కటికం గోపయ్య, నేలపట్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, వెంకన్న, వేణు, సైదులు, వీరబాబు, మహేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'కు దరఖాస్తు చేసుకోవాలి


విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : అర్హులు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శనివారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై చేతి వృత్తిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారులు మీసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేసి లోన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్ పాల్గొన్నారు.

సొంత గూటికి రామిరెడ్డి


గన్నా చంద్రశేఖర్ సమక్షంలో సీపీఐలో చేరుతున్న నంద్యాల రామిరెడ్డి, తదితరులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నంద్యాల రామిరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి సొంత గూటికి చేరారు. శనివారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ సమక్షంలో సీపీఐ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రెమిడాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నడిగూడెం : వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ కోరారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల ఉపాధ్యక్షురాలుగా బండారు శోభారాణి, వట్టికూటి పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా చిలక బాలకృష్ణను నియమించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌కె.లతీఫ్, మేకల నాగరాజు, నూకపంగు గుర్వయ్య, కాసాని లక్ష్మీకాంత్, వీరన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

పలువురికి సన్మానం


నేరేడుచర్ల : నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డిలను నేరేడుచర్లలోని 50 ఫీట్ల రోడ్డు పరిరక్షణ సమితి సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సమితి అధ్యక్షుడు బట్టు మధు మాట్లాడుతూ 50 ఫీట్ల రోడ్డు గుంతలమయంగా మారిందని, దృష్టి సారించి సీసీ రోడ్డుగా మార్చాలని కోరారు. పరిరక్షణ సమితి సభ్యులు ఎస్‌కె. యూసుఫ్, సత్యనారాయణ, గురుస్వామి, నీలా, కల్పన, సైదిరెడ్డి, జైహింద్, రమేష్, వెంకటేశ్వర్లు, సైదులు, మధు, నగేష్, కృష్ణప్రసాద్, తదితరులు ఉన్నారు.

వ్యాపారుల సన్మానం

నేరేడుచర్ల కూరగాయలు, మటన్, చికెన్ వ్యాపారుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, కమిషనర్ అశోక్‌రెడ్డిలను శనివారం సత్కరించారు. సంఘం అధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి, సతీష్‌రెడ్డి, ఆకుల సరిత, భిక్షం, మధు, శ్రీను, వెంకటేశ్వర్లు, రవి, అయ్యప్ప, రహీమా ఉన్నారు.

ఎస్‌ఐకి సీపీఐ నాయకుల సన్మానం

నేరేడుచర్ల : నేరేడుచర్ల నూతన ఎస్ఐ రవీందర్‌నాయక్‌ను శనివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నేరేడుచర్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఎస్ఐని ధనుంజయనాయుడు కోరారు. సీపీఐ నేరేడుచర్ల, పాలకీడు మండలాల కార్యదర్శులు యల్లబోయి సింహాద్రి, ముళ్ల జానయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.


నేరేడుచర్ల : చైర్మన్, వైస్ చైర్ పర్సన్, కమిషనర్లను సన్మానిస్తున్న 50 ఫీట్ రోడ్డు పరిరక్షణ సమితి సభ్యులు

ఆకట్టుకున్న ఎగ్ డే వేడుకలు


నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఎగ్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుడ్లతో నిర్వహించిన విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకున్నది.